# అహ నీ పెళ్ళంట !

సాధారణంగా జీవితంలో ప్రతి వాళ్ళకి కొన్ని ముచ్చంట్లంటూ వుంటాయ్. ఆ ముచ్చట్లే కాలక్రమేణా ఆనవాయితీగా మారి అలవాట్లుగా ముదిరి, వ్యసనాలుగా తయారయి కుర్చుంటాయ్. అదిగో, ఆవిధంగా మా కళ్యాణరావుకి, పెళ్ళిళ్ళకి వెళ్ళటం అనే వ్యసనానికి గురయ్యి, ఇంకా చెప్పాలంటే మేరేజ్ ఫంక్షన్స్ హాల్స్ చుట్టూ వాయుగుండం టైపు వేగంతో తిరుగుతున్నాడు.

అసలింతకీ ఎవరీ కళ్యాణ రావంటే నా కొలిగ్ ....పిల్లలున్నారు. పైగా పెళ్ళిగూడా అయింది. హాయిగా లక్షణంగా పిల్లపాపలతో కాపురం చేసుకోక ఈ దిక్కుమాలిన వ్యసనానికి ఎలా బలయ్యావని అతగాడ్ని ఒకరోజు టాంక్ బండ్ మీద తిక్కనగారి బొమ్మ వెనకాల హిప్నటయిజు చేయించి మరీ అడగ్గా – గోవిందరాజుల సుబ్బారావు గారిలా పగలబడి నవ్వి, హాబీగా మొదలుపెట్టి ఈ స్థితికి వచ్చేనని చెప్పి, వారానికి కనీసం మూడుసార్లయినా పెళ్ళి భోజనం లాగించకపోతే, జీవితం నిస్సారం అయిపోయినట్లు అనిపిస్తుంది, విషాదప్పాటలు, హరిశ్చంద్ర కాటిసీను, పద్యాలూ అప్రయత్నంగా పాడాలనిపిస్తుందని చెప్పి ఆవురుమని, అర్ధరాత్రి ముహూర్తమైన సరే ఏదైనా వుంటే చెప్పి పుణ్యం కట్టుకోమని కాళ్ళావేళ్ళాపడ్డాడు.

కల్యాణరావు కలుపుగోలుతనం ఎక్కువ. ఒకసారి ఒక మనిషిని హలో అంటే ఇహ ఆ శాల్తీ ఇతడి చుట్టూ పగలూ రాత్రీ ప్రదిక్షణాలు చేయాల్సిందే. ఎక్కడయినా, ఎంతరాత్రయినా సరే పెళ్ళి జరుగుతోంది అంటే నడుస్తుంటే ఆగిపోతాడు. బస్సులో వుంటే దూకేస్తాడు. ఆటోలో వుంటే ఆపమని అరుస్తాడు. ....తర్వాత చాలా దగ్గర బంధువులాగా లేటుగా వచ్చి రైలుదిగి వస్తున్న దోరణిలో చిర్నవ్వుతో పందిట్లోకి ప్రవేశిస్తారు. అంతమంది పెళ్ళివారితో ఏ ఒక్కరో పొరపాటున ఇతడిని చూసి పలకరింపుగా నవ్వుతారు. అంతే ! కల్యాణరావుకి కొండంత బలం వచ్చేసి, ‘ ఏమిటో ముహూర్తానికింకా ఎంత టైముంది ! వంటలు ఎంత వరకు వచ్చినాయ్ ? అలా దిష్టి పిడతల్లాగా నిల్చోకపోతే ఆ గ్లాసులన్నీ ఏరి ఆ పక్కన పెట్టకూడదూ.... అదేవిట్రా అంతా తలోపని చేసుకోకపోతే ఎలా ! ’ అంటూ వంటశాలలోకి వెళ్ళి అక్కడ గరిటె

వీరుల్ని గొప్పజేసి మాట్లాడి నాలుగు బజ్జీ ముక్కలు రుచికంటూ నోట్లోకి గిరాటేసి, షోడా వుప్పు కాస్త ఎక్కువైందని హెచ్చరింపచేసి ఇవతలకొచ్చేస్తాడు. ఆడపిల్ల తండ్రి దగ్గర్నుంచి , ఆయనకి అప్పిచ్చినవాడిదాకా అంతా పరాయి వాళ్ళలాగా పక్క పక్కల్న నిల్చుండిపోగా, కల్యాణరావు హడావుడి చెప్పలేం. వంటవాడు ఇతగాడ్ని వెతక్కుంటూ వచ్చి ' అయ్యా ...రెండు పంక్తులయినాయ్, ఇంకా జనం పుష్కరస్నానాలకి వచ్చినట్లు వస్తున్నారు. సాంబారు అయిపోయింది. మరి వేడి నీళ్ళు కలపమంటారా ! చన్నీళ్ళుకలపమంటారా ! " అని సుక్షితుడైన మిలట్రీ కుక్కులాగా ఆర్డర్స్ కోసం అరగంటయినా నిల్చుంటాడు గాని కన్యాదాతవైపు కన్నెత్తి గూడా చూడడు ... అదీ కల్యాణరావంటే...

అలాంటి చరిత్ర కలిగిన కల్యాణరావు ఈమధ్యన పెళ్ళిళ్ళకి వెళ్ళటం మానుకున్నాట్ట. కారణం అడిగితే ఇలా చెప్పాడు.

ఒకరోజున బాల్‌పాయింట్ పెన్ను రీఫిల్‌కోసం ఒక దుకాణంలోకి వెళ్ళాట్ట. రీఫిలు బాగా రాస్తోందో లేదోనని పరీక్ష నిమిత్తం కాగితం అడిగితే దుకాణం అతను వెడ్డింగ్ కార్డ్ ఇచ్చాట్ట. అంతేనట, అక్కడి నించి సరాసరి ఆ పెళ్ళిమంటపానికి తరలి వెళ్ళాట్ట. కాని అది హింది వాళ్ళ పెళ్ళట. పైగా ఇతడెళ్ళేసరికి వయసుకి తగ్గట్టు పెళ్ళివారంతా జట్లుజట్లుగా జుట్లు పీక్కుని, చొక్కాలు చింపుకుంటున్నారట. ఆడవాళ్ళు అరటిపళ్ళతో, విసన కర్రలతో యధోచితంగా పోట్లాడుకుంటున్నారట. ఇది వాళ్ళ సాంప్రదాయమేమోనని సరిపెట్టుకుంటుండగా , వంటశాలలోంచి వంటవాడు ఇనప గరిటెతో సహా రివ్వున వచ్చేసి మనవాడ్ని పెడీల్మని పడగొట్టి, గుండెలపైన కూర్చుని , పైగా ' కౌన్ హెూ తుమ్ , కౌన్ హెూ తుమ్ ' అంటూ ఒక్కటే గోలట. ఇన్ని పెళ్ళిళ్ళు చూశానే గాని ఈ కంగాళి టైపు వివాహం నేనెక్కడా చూడలేదంటూ , ఇంతకీ ఆ గొడవకి కారణం ఏమిటంటే, ఒక పిల్లని చూపించి, ఇంకో పిల్లని కట్టపెట్టపోయారట. ఆ సంగతి పసిగట్టి గుర్రంమీద పెళ్ళికొడుకు వెనక్కు తిరిగి స్పీడుగా పూలదండలు భుజానవేసుకుని పారిపోయేట్ట. అదిట, సంగ్రామానిక్కారణం .

అయినా కల్యాణరావ్ ఇదెక్కడి చిత్రమైన అలవాటయ్యా, ఎవరన్నా వింటే నవ్విపోగలు అని నేనంటే – మీకు తెలీదు గురూ గారూ, దగ్గరుండి ఒక ఆడని, ఒక మగని కలిపించేస్తే నాకేమిటో ధైర్యం, సంతోషం. జైలుగదిలో ఒక్కళ్ళం వుండటం కన్నా పదిమందితోడుంటే ఎప్పుడూ హర్షించదగ్గసంగతే కాదంటారా అంటూ నావంక అదోలా చూసేడు.

------- అయ్యిపోయింది -------